కథ


# ఎంతెంత దూరం

మొలకలపల్లి కోటేశ్వరరావు

**మై డియర్ ఫ్రెండ్ నాగరాజూ.....**
**మేము క్షేమం.**
**నీవు బాగున్నావా? నీ భార్య అరుణా, పిల్లలూ ఎలా వున్నారు? వాళ్ళూ కుశలంగా ఉన్నారని తలుస్తాను.**
**నేను ఇలా ఉత్తరం రాయాల్సి వస్తుందని భావించలేదు. ఈ ఉత్తరం రాయడం కూడా బాధతోనే, ఇబ్బందిగానే రాస్తున్నాను. ఈ ఉత్తరం రాయడం నాకూ ఏం సంతోషంగా లేదు. ఇక్కడ మీ నాయన ఆరోగ్యం ఏమీ బాగులేదు. పూర్తిగా క్షీణించి పోయాడు. నేడో, రేపో అన్నట్లు వుంది పరిస్థితి. అనకూడదు కానీ, వాలిపోయిన పొద్దు ఎంతకాలం వుంటుంది? దాని పాటికి అది కొండల్లో పడుతుంది గదా! బహుశా, ఈ ఉత్తరం నీకు చేరేలోపే ఆయన ఆరోగ్య పరిస్థితి తారుమారు కావచ్చు. ఈ ఉత్తరం చేరక ముందే నీకు ఫోన్ కాల్ రావచ్చు.**

పెళ్ళయ్యి, వెళ్ళిన వెళ్ళడం ఇంతవరకూ నీవు తిరుగు ముఖం పట్టి చూడలేదు. నీవు వెళ్ళి దాదాపు ఎనిమిదేళ్ళు అయిందనుకుంటాను. అవును, నీ పెళ్ళయ్యి ఎనిమిదేళ్ళు. మధ్యలో ఒక సారి నీ భార్య అరుణ కాన్పుకోసం వచ్చి వెళ్ళింది. కాన్పుకోసం పుట్టింటికి వచ్చినప్పుడు మన వూరు ఒక రోజు చుట్టపు చూపుగా వచ్చింది. ఇక్కడికి ఉదయం వచ్చి, సాయంత్రానికి వెళ్ళిపోయింది. ఒక్క రోజు కూడా వుండలేదు.

వాళ్ళు ధనవంతులూ, లక్షాధికార్లూ కాబట్టి మన ఇంట్లో వుండలేకపోవచ్చు. ఈ ఇంటి వాతావరణంలో ఇమడటం కష్టం కావచ్చేమో! నీవు ఇక్కడ లేవు. మీ అమ్మా నాయనతో ఆ అమ్మాయికి సంబంధం, అనుబంధం చాలా తక్కువ. వీళ్ళు అత్తమామలే కానీ, కన్నవాళ్ళు కాదు గదా! ఎడం ఎడమే! ఆమెకి మన వూరు కొత్త ప్రదేశమే! అలాంటప్పుడు ఇక్కడ వుండలేదని భావించడం కూడా న్యాయం కాదు. మీ నాయనకి అదొక కొరవ, అసంతృప్తి. కోడలు వచ్చి రెండు రోజులు కూడా వుండలేదనీ, ఉంటే బాగుండేదనీ నాతో అన్నాడు. ఇబ్బందో, సబ్బందో కోడలే కదా, ఇక్కడ రెండు రోజులు వుంటే ఏం పోయిందని అన్నాడు. నేను ఆయనకి వివరంగా విషయం చెప్పి, బాధపడొద్దని నచ్చచెప్పాను. మాట అయితే చెప్పాను కానీ మనమాటతో ఆయన బాధ తీసివేసినట్లుగా పోతుందా? కేవలం ఓదార్పు అనుకో!




సరే, కోడలు ప్రసవించినప్పుడు మీ అమ్మా నాయనా మీ అత్తవారి వూరు వెళ్ళి, మనమడ్ని చూసి, బంగారు గొలుసు, వెండి మొలతాడు ఇంకా ఏవో చిన్నచిన్న వస్తువులు చేయించి ఇచ్చి వచ్చారు. మళ్ళీ మరో బాధాకరమైన విషయమేమిటంటే, మనమడ్ని మన వూరు ఒక్కసారి తీసుకు వచ్చి, తల్లీబిడ్డా ఒక పూట వుండి వెళ్తే బాగుండేది. కానీ, ఇక్కడికి రానే లేదు. వాళ్ళ వూరు నించి మీ మామయ్యగారు అమెరికా తీసుకుపోయి వదిలిపెట్టి వచ్చారట కదా! నువ్వంటే అల్లుడివి కాబట్టీ, అమెరికాలో పెద్ద ఉద్యోగస్తుడివి కాబట్టీ విలువా, గౌరవం వుండవచ్చు. తప్పు లేదు. కానీ నీ కన్నవాళ్ళ మీద మీ అత్తమామలకి విలువా, గౌరవం లేదని మీ నాయన బాధ!

కనీ, పెంచిన మీ అమ్మ కడసారి చూపులకి కూడా నీవు నోచుకోక పోయావు. మీ అమ్మ నిన్ను చూడాలీ, చూడాలీ అని అవసానదశలో కలవరించీ, కలవరించీ కన్ను మూసింది. నిన్ను చూడాలని చాలాపరితపించి పోయిందామె! కనీసం కర్మకాండలు అయినా నీ చేత్తో చేస్తావని భావించాము. కానీ నీవు రాలేక పోయావు! చేయలేక పోయావూ!

ప్రపంచం అంతా కుగ్రామం అయిపోయిందంటున్నారు. ఎల్లలు చెదిరిపోయాయంటున్నారు. దూరాలు తగ్గిపోయి కుంచించుకుపోయిందంటున్నారు. ప్రపంచమే కాదు, మనుషులు కూడా

Story



బాగా కుంచించుకుపోతున్నారనిపిస్తోంది. ప్రపంచం దగ్గరవుతున్నా మనుషులు మాత్రం దూరమై పోతున్నారు. మనసులు మరీ దూరమై పోతున్నాయి. ఆప్యాయతలూ, అనురాగాలూ, ఆత్మీయతలూ, అనుబంధాలూ, సంబంధాలూ అన్నీ కనుమరుగై పోతున్నాయి. అన్ని బంధాలు డబ్బు సంబంధాలైపోతున్నాయి. అన్ని విషయలూ, అన్ని ప్రేమలూ డబ్బుతోనే ముడిపడి వుంటున్నాయి.

ఒక్క కొడుకువి. మీ అమ్మా నాయనకి పెళ్ళయిన ఎంతో కాలానికి, నడికారు దాటిన తరువాత, ఇక పుట్టరనుకున్న దశలో నీవు పుట్టావు. లేకలేక కలిగిన సంతానమని నిన్ను ఎంత అపు రూపంగా, ఆత్మీయంగా, అల్లారుముద్దుగా పెంచారో నీకు తెలుసు కదా! మీకు ఆస్తిపాస్తు లేవీ లేవు. వాళ్ళ కష్టమే ఆధారం. వాళ్ళు రెక్కలు ముక్కలు చేసుకునీ, కూలీనాలీకి పోయి, తినీతినకా జిగినితనంగా వుండి నిన్ను చదివించారు. ఒక్కమాటలో చెప్పాలంటే వాళ్ళు కడుపు మాడ్చుకుని నిన్ను చదివించారు. చదువులో నీవు చాలాచురుకుగా వుండేవాడివి. చదువులో చాలా ప్రతిభావంతుడివే. కాదనను. అయినా వాళ్ళు చదివిస్తేనే కదా నీవు చదువుకోగలిగింది. చిన్నప్పుడు నిన్ను బడికి వేయకుండా, పేద వాళ్ళు అందరి మాదిరిగానే వెంట పెట్టుకుని కూలికి తీసుకుపోయి వున్నట్లయితే నువ్వీ స్థితిలో వుండే వాడివా?

నీవు అమెరికా వెళ్ళిన కొత్తలో మీ నాయన ఎంత సంతోషపడిపోయాడో! ఎంత గొప్పగా, గర్వంగా, విజేతగా ఫీలయ్యాడో మాటల్లో చెప్పలేం.

“నీ కొడుకు అమెరికా పోయాడంటగా? ఇంక నీకు తిరుగులేదులే. ఆదృష్టవంతుడివి?'' అని ఎవరైనా అంటే మీ నాయన గుండెలు ఉప్పొంగిపోయేవి. ఎంతో ఆనందపడి పోయే వాడు. కళ్ళలో మెరుపులు మెరిసేవి.

అయితే ఇదంతా గతం.

ఇటీవల కాలంలో ఎవరైనా “నీ కొడుకు అమెరికాలో ఉన్నాడంటగా?'' అంటే చాలా బాధపడి పోయేవాడు.

“ఎందుకు అమెరికా? అమెరికాలోనేనా తిండి తినేదీ, ఇక్కడ తినడం లేదా? ఇది దేశం కాదా, ఇక్కడ మనషుల్లేరా? వీళ్ళు మనుషులు కారా? అయిన వాళ్ళనీ, కన్నవాళ్ళనీ వదిలిపెట్టి, ఊరు కాని వూళ్ళో, దేశం కాని దేశంలో వుండాల్సిన గతి ఏమొచ్చింది? డబ్బు సంపాదించుకుని ఏం చేసుకుంటాం? సంపాదనకి పరిమితిఏముంది? డబ్బేమైనా తింటామా?'' అనే వాడు ఆవేదనతో, ఆవేశంతో. మీరు దూరంగా వున్న బాధ ఆయన ప్రతి మాటలో స్పష్టంగా తెలుస్తూనే ఉండేది.

ఇటీవల కాలంలో మన వూరినించి కొంతమంది పిల్లలు అమెరికా వెళ్ళారు. ఇక్కడ వాళ్ళ తల్లిదండ్రులకి సామాజికంగా గొప్ప హోదా వచ్చినట్లుగా వుంది. ఇతరుల కంటే ఉన్నతులైనట్లు గానూ, ఏమిటో సాధించినట్లుగానూ, చాలా గొప్ప వాళ్ళు అయినట్లుగానూ భావిస్తున్నారు. వాళ్ళ పిల్లలు అమెరికాలో వుంటే వీళ్ళకి ఎంత గొప్పదనమో! అమెరికా ఎలా వుంటుందో వీళ్ళకి తెలియదు. అఫ్ కోర్స్, మన దేశం కంటే ఆ దేశం నిజంగానే బాగుండొచ్చు. పని కోసం, భృతి కోసం, ఇక్కడ ఉద్యోగం దొరక్క, ఒక వేళ దొరికినా డబ్బు సరిపోకనో, ఎక్కువ సంపాదన కోసమో అమెరికా వెళ్తే ఆ గొప్పదనం ఏమిటో నాకు తెలియడం లేదు.

మీ అమ్మ మరణించి ఏడాదిన్నర అవుతుందనుకుంటాను. ఆమె పోయిన తరువాత మీ నాయన ఒంటరితనంతో చాలా కృంగిపోయాడు. ఎంతవేదన అనుభవించాడో మాటల్లో చెప్పలేను. దిగులు ఆవరించింది. మనిషి సగం చచ్చిపోయాడు. తనలో తానే ఏదో మాట్లాడుకుంటూ, ఒంటరిగా కూర్చుని ఏడ్చుకుంటూ ఉండే వాడు. మీ పెద నాయన కొడుకు మీ నాయనని బాగానే చూస్తున్నాడు. అయినా, వాళ్ళకి ప్రేమలూ, ఆప్యాయతలూ ఎందుకు వుంటాయి. ఎక్కడ్నించి వస్తాయి? నిజానికి వాళ్ళకి చూడాల్సిన బాధ్యత మాత్రం ఎందుకు వుంటుంది? కేవలం నువ్వు పంపిస్తున్న డబ్బు కోసం ఆశపడి, ఆ డాలర్ల డబ్బు మీద ప్రేమతోనే మీ నాయనని చూస్తున్నారు అని వూళ్ళో అనుకుంటున్నారు. నిజం కూడా అదే.

పుట్టినప్పుడు మనుమడ్ని చూడటం తప్ప, తరువాత మీ అమ్మ చూడలేదు. మీ నాయనా అంతే. ఆయనకి అక్కడ అమెరికాలో మనుమరాలు పుట్టిందనే విషయం తెల్సు. నీవు పంపించిన నీ పిల్లల ఫొటోలు చూసారు. అంతే కానీ మనుమరాల్ని ఎదురుగా, ప్రత్యక్షంగా చూడలేదు. మీ నాయనా, బహుశ మనమరాల్ని చూడకుండానే వెళ్ళిపోతాడేమొ! తల్లిదండ్రులకి కొడుకుల మీద కంటే, ఆ కొడుకుల సంతానం మీదే ఎక్కువ ఆపేక్షలూ, ప్రేమలూ వుంటాయట. మనుమల ముద్దు ముచ్చట్లతో, ఆట పాటలతో, అల్లరి చేష్టలతో ఆనందిస్తూ, ఆ వృద్ధాప్యంలో సుఖంగా, సంతోషంగా, ప్రశాంతంగా గడుపుతుంటారు చాలామంది. మీ అమ్మా నాన్నలకి ఆ అవకాశం లేక పోయింది. రంపపు కోత అనుభవించి మీ అమ్మ వెళ్ళిపోయింది. మీ నాన్న రోజులు లెక్క పెట్టుకుంటున్నాడు.

ఇంటర్నెట్‌లూ, ఇ మెయిళ్ళూ, చాటింగ్‌లు, వీడియో ఫోన్లూ, మొబైల్ ఫోన్లూ ఇంకా ఏవేవో రకరకాల గొప్ప గొప్ప పరికరాలూ, సాంకేతిక పరిజ్ఞానం వచ్చాయంటున్నారు. అవేంటో నాకు తెలియదనుకో. సమాచార విప్లవం అంటున్నారు. సాంకేతిక విప్లవం అంటున్నారు. నీవు అత్యంతాధునిక, ఇవ్వాళ ప్రపంచాన్నే తన కొనగోటితో శాసిస్తున్న సూపర్ పవర్ అమెరికా దేశంలో వుంటున్నావు. ఇక్కడ మీ నాయన “కొడుకో... కొడుకో'' అంటూ మంచంలో పడి దీనాతిదీనంగా విలవిలలాడి పోతున్నాడు. కుమిలి పోతున్నాడు. నేడో, రేపో ఈ లోకాన్నే శాశ్వతంగా విడిచి పోతున్నాడు. మనుషులకి మేలుచేసే ఇంత గొప్ప విప్లవం. ఇంత గొప్ప సాంకేతిక జ్ఞానం మీ నాయన దగ్గరకి నిన్ను ఎందుకు చేర్చలేక

పోయింది? ఈ సాంకేతిక విప్లవాలూ, ఈ వలసలూ మనుషులకీ, మానవ సమాజాలకీ, దేశాలకీ మేలు చేస్తున్నాయా? కీడు చేస్తున్నాయా?

అమెరికా అగ్రరాజ్యం. ప్రపంచంలోని దేశాలు అన్నిటినీ తన గుప్పిట్లో పెట్టుకుని, తను చెప్పినట్లల్లా ఆడిస్తోంది. మరి దేశాల్నీ, పాలక వర్గాల్నేనా, సామాన్య జనాన్ని కూడా గుప్పిట్లో బంధించిందా?

చిన్నప్పుడు మనం రెండు పందిరి గుంజల్ని పట్టుకుని, ఆ గుంజల చుట్టూ తిరుగుతూ చిక్కించుకునే ఆటలో ''ఎంతెంత దూరం'' అంటే ''చాలా చాలా దూరం'' అంటూ ఆడుకోవడం నాకు గుర్తొస్తోంది.

ఆ రెండు గుంజల మధ్యదూరం రెండు మూడు గజాలకి మించి వుండదు. అది దూరం అనుకుంటే దూరం. దగ్గర అనుకుంటే దగ్గర. కానీ ఆ కొద్ది దూరం కూడా దొరక్కుండా ఆట పట్టించే వాళ్ళు కొందరు వుండే వాళ్ళు. ఇవ్వాళ లోకం చిన్నగ్రామం అయిపోందంటున్నప్పుడు ఒక గ్రామంలో అయిన వాళ్ళు ఒకర్ని ఒకరు కలుసుకోకుండా వుండగలరా? చూడకుండా వుండగలరా? నీవు ఎనిమిది సంవత్సరాలుగా తల్లిదండ్రుల్ని చూడకుండా, ముసలితనంలో వాళ్ళదారిన వాళ్ళని విడిచిపెట్టి వున్నావంటే ఏమనుకోవాలి? కన్నతల్లికి కర్మకాండలు పుత్రుడిగా నీవు జరపలేదంటే ఏమని భావించాలి?

నీకు మన వూరన్నా, మీ అమ్మా నాయన అన్నా అభిమానం, మమకారం అని ఇన్నాళ్ళూ భావించే వాడ్ని. అయితే అదంతా నాభ్రమే అని ఇప్పుడు భావించాల్సి వస్తోంది. నీవు మన వూరు ఎందుకు రాలేక పోయావో నాకు తెలియడం లేదు. మీ నాయన అంతిమకోరిక. కడసారి వాంఛ నిన్ను చూడాలని. నీవు ఎంతత్వరగా వీలయితే, అంత త్వరగా రాగలిగితే మీ నాయన కోరికను తీర్చిన వాడివవుతావు.

ఇంతకంటే ఇక రాయగలిగింది మాత్రం ఏం వుంది? నీ ఇష్టం ఇక, ఉంటాను.

ఒకప్పటి నీ బాల్య స్నేహితుడు
రామారావు

***

చికాగో

..................

రామారావ్.....

నీవు రాసిన ఉత్తం అందింది.

నీకు ఏమని జవాబు రాయాలో నాకే తెలియడం లేదు. ఇప్పుడు నేను రాలేక పోతున్నాను. ఇక మా నాయనని చూసే అవకాశం నాకు లేదు. ఈ మాటలు రాస్తుంటే నాకు చాలా దుఃఖంగా, బాధగా వుంది. అంత బాధపడేవాడివి రావొచ్చు కదా అనొచ్చు నీవు. నేను వచ్చి ఏం చేయ గలను? పోతున్న మా నాయన ప్రాణాన్ని నిలబెట్టగలనా? ఆయనకి పూర్తి వృద్ధాప్యం వచ్చింది. నాకు తెలుసు కొద్ది రోజుల్లో ఇలాంటి కబురు ఏదో వస్తుందని!

ఇక్కడ పరిస్థితులు ఏమంత బాగులేవు. పైకి గొప్పేకానీ, ఎన్నో ఇబ్బందులూ, టెన్షన్లూ, ఆందోళనలూ, బతుకు భయం! ఉద్యోగ భద్రత లేదు. జీవిత భద్రత లేదు. ఆర్థిక భద్రత లేదు.

ఏ రోజు ఉద్యోగం నించి వూడ బెరుకుతారో తెలియదు. కనీసం నష్టపరిహారం కూడా ఇవ్వరు. వాళ్ళకి అవసరం లేకపోతే నోటీస్ బోర్డు మీద మన పేరు ప్రత్యక్షమవుతుంది. దీనిని బెంచ్ మీద పెట్టడం అంటారు. ఉద్వాసన జరిగిపోతుంది. ఉద్యోగం వూడిపోతే ఎలా బతకాలి? భార్యా బిడ్డల్ని ఎలా పోషించాలి? వీధి పాలు కావాల్సిందే.

ఇక్కడ దాదాపు వెట్టిచాకిరీ. రోజుకి 12, 13 గంటలు పని చేయాలి. నిర్బంధ, నిరంతర శ్రమకి వ్యతిరేకంగా తుపాకీ గుళ్ళకి ఎదురొడ్డి, రక్తతర్పణం చేసి రోజుకి 8 గంటల పని దినాన్ని సాధించుకున్న చికాగో లోని పరిస్థితి ఇది. ఇవాళ్ళ 12 గంటలకి తక్కువ పని లేదు. పూర్వ కాలంలో బానిసలు వుండేవాళ్ళని చదువుకున్నాం. పొలాల్లోనూ, గనుల్లోనూ మెడలకి గొలుసులు బంధించి పని చేయించుకునే వాళ్ళు. ఇవ్వాళ మాకు అదృశ్య గొలుసులు వేసి పని చేయించుకుంటున్నారు. అవి డాలర్ గొలుసులు. ఒక రకంగా చూస్తే ఇవ్వాళ మేం బానిస చాకిరే చేస్తున్నాం.


నేను ఒక్కడ్నీ రావడానికి వీలుపడదు. అరుణనీ, పిల్లల్నీ తీసుకుని రావడం సాధ్యం కాదు. మాకు ఉన్న కొద్దిపాటి ఆస్తిని మా పెద నాయన కొడుకునే తీసుకొమ్మనీ, అతన్నే మా నాయన అంతిమ సంస్కారాల్ని చేయమనీ చెప్పాను. నేను రాలేకపోతున్నందుకు దయచేసి మీరు ఏమీ అనుకోవద్దు. ఈ విషయం మా నాయనకి తెలియనివ్వకండి. వస్తున్నానని చెప్పండి. ఆయనకి కొంత ఉపశమనం దొరుకుతుంది. తృప్తితో కన్ను మూస్తాడు.

ఇట్లు
నాగరాజు,
చికాగో

రామారావుకి ఈ ఉత్తరం చేరకముందే, నాగరాజు తండ్రి అంత్యక్రియలు జరిగిపోయాయి.

*

రచయిత చిరునామా:
మొలకలపల్లి కోటేశ్వరరావు,
పమిడిపాడు పోస్టు,
రావినూతల – 523 216. ప్రకాశం జిల్లా



## జాన్ గొప్ప సెక్సీయస్ట్ మేన్–బిపాసా

జాన్‌ను మించిన సెక్సీయస్ట్ మేన్ ఎవ్వరూ లేరని అతని గర్ల్ ఫ్రెండ్ బిపాసా బసు ఓ స్టేట్‌మెంట్ ఇచ్చేసింది. ఇది తన ఒక్కదాని అభిప్రాయం కాదని ఆసియా మొత్తం అభిప్రాయం అని ఆమె అంటోంది. 2008 సంవత్సరానికిగానూ జాన్‌అబ్రహమ్‌కి సెక్సీ సింబల్ ఓటును ఆసియాలో చాలా మంది వేశారు. ఈ సందర్భంగా బిపాసా మాట్లాడుతూ, 2007 సంవత్సరానికి గానూ 'ఈస్టన్ ఐ' వారు నన్ను సెక్సీయస్ట్ ఉమెన్‌గా ఎంపిక చేయగా, ఇప్పుడు సెక్సీయస్ట్ మేన్‌గా జాన్‌అబ్రహం ఎంపికయ్యాడు. ఇప్పుడప్పుడే అతన్ని బీట్ చేసేవారే లేరంటూ తెగ పొగిడేస్తోంది. 'ఒక స్త్రీని బికినీలో చూస్తే ఆమె అందాన్ని పొగుడుతారు. అదే మగవాడు స్విమ్ డ్రస్‌లో కనపడితే ఎందుకు పొగడరు?' అంటూ ఎదురు ప్రశ్నించింది. 'మగవారిలో కూడా అందమైన పర్సనాలిటీ ఉన్నవారు ఉన్నారు ఈ విషయంలో నాకు చాలా సంతోషంగా ఉంది. జాన్‌కు అలాంటి బాడీ ఉంది' అంది. 'ధూమ్–2లో ఆమె వేసుకున్న బికినీ మీద వచ్చిన వివాదం గురించి మాట్లాడుతూ, వాటి గురించి పట్టించుకోవలసిన అవసరం లేదంటూ కొట్టిపారేసింది.